క్లుప్తంగా

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి


పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ నేతాజీ

కవిటి: రైతు సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని వైస్ ఎంపీపీ పూడి నేతాజీ అన్నారు. మండలంలోని జగతి రైతు భరోసా కేంద్రం పరిధిలో ఖరీఫ్ విత్తన పంపిణీని స్థానిక సర్పంచ్ పి.వరప్రసాద్‌తో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. ఖరీఫ్‌లో భూసారాన్ని పరిరక్షించుకునేందుకు వీలుగా పచ్చిరొట్ట పెంపకాన్ని ప్రోత్సహించడం శుభపరిణామం అన్నారు. అవసరమైన రైతులందరికీ విత్తనాలు పంపిణీ చేసినట్లు సచివాలయ వ్యవసాయ సహాయకుడు బెందాళం శ్రీకల్యాణ్ తెలిపారు.

ప్రమాద బాధితులుంటే వివరాలివ్వాలి

మందస: ఒడిశాలో జరిగిన ఘోర రైలు ప్రమాదానికి సంబంధించిన మృతులు కానీ, క్షతగాత్రులు గానీ ఉంటే తక్షణమే సమాచారమివ్వాలని తహసీల్దార్ బడే పాపారావు, ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావులు శనివారం ఒక ప్రకటనలో కోరారు. సచివాలయాల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు సమాచారం అందజేస్తే తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాలకు వివరాలు అందజేయాలని కోరారు.

తక్షణ సాయం అందజేత


తక్షణ సాయం అందజేస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కప్పల కృష్ణమూర్తి ఇటీవల మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబానికి మంజూరైన వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలను జెడ్పీటీసీ దుబ్బ వెంకటరమణారావు చేతులమీదుగా శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పంకు రాము, సర్పంచ్ బొమ్మాళి రాము, కార్యదర్శి కె.కృష్ణా రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

టెక్కలి: టెక్కలి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి సంబంధించి స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఇంటర్వ్యూలు ప్రశాంతంగా జరిగాయి. సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆయనతో పాటు ఐసీడీఎస్ పీడీ జయదేవి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో లక్ష్మీతులసీ, సీడీపీవో శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి సాయం


సంతోషికి రూ.10 వేలు అందజేస్తున్న శ్రీనివాసరెడ్డి

కాశీబుగ్గ: మందసలోని దండాసి వీధికి చెందిన కొమ్మాన సంతోషి తితిలీ సమయంలో ఇంటిని కోల్పోగా, ప్రస్తుతం ఇల్లు కట్టుకుంటోంది. దీంతో నిరుపేద కుటుంబానికి చెందిన ఆమెకు పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన తమలంపూడి శ్రీనివాసరెడ్డి రూ.10 వేల ఆర్థిక సాయం శనివారం అందజేశారు. ఆయనతో పాటు చిన్నికృష్ణ ఉన్నారు.

ఎమ్మెల్సీ నర్తు పరామర్శ


కార్తీక్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

కంచిలి: మండలంలోని కత్తివరం గ్రామానికి చెందిన కోరాడ కార్తీక్ ఇటీవల జరిగిన రహదారి ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావు పార్టీ నాయకులతో కలిసి శనివారం ఆ కుటుంబాన్ని పరామర్శించి, సంతాపం తెలియజేశారు. అనంతరం రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నేత ఇప్పిలి కృష్ణారావు, సర్పంచ్ దుర్గాసి శివ, ఉప సర్పంచ్ కోరాడ దుర్యోధన తదితరులు ఉన్నారు.

కమనీయం... అన్నపూర్ణమ్మ ఉత్సవం


దేవరవీధిలో ఏర్పాటు చేసిన గ్రామ దేవత అన్నపూర్ణమ్మ తల్లి


అమ్మవారిని దర్శించుకున్న అధికారులు


పల్సర్ బైక్ ఝాన్సీతో యువత సెల్ఫీలు


రామాయణ పౌరాణిక వేషధారణలు


ఆకట్టుకుంటున్న గ్రామ దేవతల వేషధారణలు


సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరైన జనం


గ్రామ దేవతల వేషధారణల్లో యువకులు

మందస గ్రామదేవత అన్నపూర్ణమ్మ తల్లి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. ఉత్సవాలకు భక్తులు పోటెత్తుతున్నారు. గ్రామ దేవతను దర్శించుకోవడానికి మందసతో పాటు చుట్టుపక్కల గ్రామాలు, పలాస, వజ్రపుకొత్తూరు, సోంపేట మండలాల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. పలు వీధుల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. ప్రతిరోజూ బస్టాండ్‌లో ఉన్న వేదికపై జరుగుతున్న కార్యక్రమాలకు ఇసుక వేస్తే రాలనంత జనం హాజరవుతున్నారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల నాట్యాలతో అమ్మవారిని అర్ధరాత్రి వరకు ఊరేగిస్తున్నారు. కాశీబుగ్గ రూరల్ సీఐ శ్రీనివాసరావుతో పాటు తహసీల్దార్ బడే పాపారావు, ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు గ్రామదేవతను దర్శించుకున్నారు. మందస ఎస్‌ఐ వై.రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. – మందస

సబ్ కలెక్టర్ దృష్టికి నియోజకవర్గ సమస్యలు


సబ్ కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న దువ్వాడ వాణి

టెక్కలి: నియోజకవర్గంలోని పలు సమస్యలను వైఎస్సార్‌సీపీ నాయకురాలు దువ్వాడ వాణి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి దృష్టికి శనివారం తీసుకెళ్లారు. టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల్లో సమస్యలపై విన్నవించారు.

ఆక్రమణలు తొలగించాలి

కోటబొమ్మాళి: మండలంలోని తర్లిపేట–జియ్యన్నపేట పంచాయతీల్లో సర్వే నంబర్ 36లోని తర్లి కొండ చుట్టూ ఉన్న ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను తక్షణమే తొలగించి, ఆ స్థలంలో అర్హులైన పేదలకు పట్టాలు మంజూరు చేయాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యుడు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ జామి ఈశ్వరమ్మకు వినతిపత్రం శనివారం అందజేశారు. ఇదివరకు ఈ విషయాన్ని కలెక్టర్‌కు విన్నవించినట్లు తెలియజేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

సోంపేట: సోంపేట టౌన్ ఫీడర్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని టెక్కలి ఈఈ రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 33/11 కేవీ సోంపేట సబ్‌స్టేషన్ మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని సోంపేట, బెంకిలి, జింకిభద్ర, పలాసపురం, ఇస్కలపాలేం, రుషికుద్ద, మండపల్లి పంచాయతీల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

'మేనిఫెస్టోను విస్తృతంగా ప్రచారం చేయాలి'

● టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు


మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి: మహానాడులో టీడీపీ ప్రకటించిన మేనిఫెస్టోను ఈనెల 10వ తేదీ నుంచి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని కార్యకర్తలకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు దిశానిర్దేశం చేశారు. కోటబొమ్మాళి–కొత్తపేట మెయిన్ రోడ్డులో కొత్తగా నిర్మించిన టీడీపీ కార్యాలయం ఈనెల 10వ తేదీన ప్రారంభించనున్న సందర్భంగా, కార్యాలయానికి వచ్చి శనివారం పరిశీలించారు. అనంతరం పార్టీ విధివిధానాలపై నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గద్దె దించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత


ఆర్థిక సాయం అందజేస్తున్న ఆనందరావు

కంచిలి: మండలంలోని భోగాబెణి పంచాయతీ పరిధి జెన్నగాయి గ్రామానికి చెందిన గుమ్మడి గవరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారిది ఆర్థికంగా వెనకబడిన కుటుంబం కావడంతో కంచిలికి చెందిన ఉద్దానం సేవా సమితి సభ్యుడు మద్దిలి ఆనందరావు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గుమ్మడి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వానికి అండగా నిలవాలి'


మాట్లాడుతున్న సర్పంచ్ జగబందు దొళాయి

కంచిలి: పంచాయతీ పరిధిలోని మహిళలందరూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని తలతంపర సర్పంచ్ డాక్టర్ జగబందు దొళాయి కోరారు. పంచాయతీలోని గ్రామ సంఘం సభ్యులు, లీడర్స్‌తో సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ సున్నా వడ్డీ, జగనన్న తోడు తదితర పథకాలు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీసీ బి.పాపారావు, వీవోఏ కుమారి దొళాయి, గ్రామ సంఘ అధ్యక్షురాలు లలితా బిసాయి తదితరులు పాల్గొన్నారు.

మశాఖపురంలో దేవాలయం ప్రతిష్ట


ఇచ్ఛాపురం రూరల్: నదీ జలాలు తీసుకొస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని మశాఖపురంలో ఉమాసహిత భువనేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట శనివారం జరిగింది. దీనిలో భాగంగా ఉదయం బ్రహ్మశ్రీ అంపోలు రుద్రకోటేశ్వర శర్మ ఆధ్వర్యంలో మహిళలు స్థానిక బహుదానది నుంచి కలశాలతో గంగా జలాన్ని తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పండితులు పంచగవ్య ప్రాసన రుత్విక్వరుణం, రక్షాసూత్ర ధారణ, యాగశాల ప్రవేశం, శాలా విహరణ, అఖండ దీపారాధన, ధ్వజ పతాకావిష్కరణ చేపట్టారు.


సోంపేట: ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్

సోంపేట: మండలంలోని మామిడిపల్లి పంచాయతీ పాత్రపురం గ్రామంలో ఉమామహేశ్వర స్వామివారి దేవాలయ ప్రతిష్ట మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దున్న మాధవరావు, లింగరాజు, శంకరరావు, సంతోష్, ప్రసాద్, పాతిన మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.

వేధిస్తున్న వీధి దీపాల సమస్య

కాశీబుగ్గ: పలాస మండలంలోని బ్రాహ్మణతర్లా పంచాయతీ పండా శాశనాంలో ఉన్నటువంటి పలు వీధుల్లో విద్యుత్‌దీపాలు వెలగక సమస్యగా మారింది. రెండు నెలలుగా సమస్య ఉండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పారిశుద్ధ్య పనులు


పారిశుద్ధ్య పనులు చేపడుతున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస మండలం బ్రాహ్మణతర్లా పంచాయతీ పరిధిలో ఉన్నటువంటి పండా శాశనాంలో శనివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. రోడ్లు, కాలువలు, వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. కార్యక్రమంలో స్థానిక యువత, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన విద్యార్థులు


నౌపడ ఉదయ్


ఇరోతు గణేష్‌రావు


మద్దిలి సాయిచరణ్


లోళ్ల సారిక


ధరణిశ్రీ


సంయుక్త


జీవన్

కవిటి: మండలంలోని బొరివంక జెడ్పీహెచ్ స్కూల్ పాఠశాల విద్యార్థులు 2022–23 విద్యా సంవత్సరానికి నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పరీక్షలో సత్తాచాటారు. పాఠశాలకు చెందిన నౌపడ ఉదయ్, ఇరోతు గణేష్‌రావు, మద్దిలి సాయిచరణ్, లోళ్ల సారిక అనే నలుగురు విద్యార్థులు స్కాలర్ షిప్‌కు అర్హత సాధించారు. వీరికి ఏడాదికి రూ.12,000 వంతున నాలుగేళ్ల పాటు కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనాన్ని అందిస్తుందని హెచ్‌ఎం సనపల రామకృష్ణ తెలిపారు. ఉపాధ్యాయుల కృషిని సర్పంచ్ బెందాళం శ్రీరాంప్రసాద్, ఎంపీటీసీ దుద్ది సతీష్, మాజీ ఎంపీటీసీ బి.విజయకృష్ణలు ప్రశంసించారు.

టెక్కలి: మండలంలోని సీతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్‌కు అర్హత సాధించారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బంగారు ధరణిశ్రీ, మల్ల సంయుక్త, రాకోటి జీవన్ తదితరులు ఉపకార వేతనాలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం ఎస్.వేణికుమారి వెల్లడించారు. దీంతో విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

నందిగాం: మండలంలోని నర్సిపురం, లఖిదాసుపురం, కొత్తగ్రహారం పాఠశాలల విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారు. నర్సిపురం ఉన్నత పాఠశాలకు చెందిన సారా జయకృష్ణ, లఖిదాసుపురం ఉన్నత పాఠశాలకు చెందిన బాలక జస్వంత్‌సాయి, కొత్తగ్రహారం ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఊలపల్లి హారిక అర్హత సాధించినట్లు ఉపాధ్యాయులు తెలియజేశారు. విద్యార్థుల ఎంపికపై ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు హేమలత, చిలుకు కృష్ణారావు, తుంగాన కేశవుడు హర్షం వ్యక్తం చేశారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత ఎస్‌ఆర్‌సీపురం


విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

కంచిలి: మండల కేంద్రంలో నిర్వహించిన కంచమ్మ తల్లి క్రికెట్ టోర్నమెంట్‌లో ఎస్.ఆర్.సి.పురం విజేతగా నిలిచినట్లు నిర్వాహకులు తెలియజేశారు. అలాగే రన్నర్‌గా కవిటి జట్టు నిలిచింది. వీరికి ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గుమ్మిడి రాందాసులు ట్రోఫీలు శనివారం అందజేశారు. కార్యక్రమంలో మద్దిలి ఆనంద్, దొక్కరి బలరాం, దుబ్బ లోకనాథం, దొక్కరి దాలయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఆర్బీకేల్లో నమోదు చేసుకోవాలి'


విత్తన నమోదు చేయిస్తున్న వ్యవసాయ సహాయకుడు మల్లేశ్వరరావు

ఇచ్ఛాపురం రూరల్: ఖరీఫ్ పంటకు అవసరమైన విత్తనాల కోసం రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పిరియా శ్రీదేవి సూచించారు. శనివారం తన కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. ముందస్తుగా ఆర్బీకేల్లో రైతులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి, రైతు అవసరం మేరకు కావలసిన విత్తనాలను పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు నంబర్‌తో నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. దీంతో పలు గ్రామాల్లో విత్తన నమోదు ప్రక్రియ చేపట్టారు.

రెండేళ్ల బాలుడికి తలసేమియా పింఛన్


పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ మోహన్‌రెడ్డి తదితరులు

టెక్కలి: మండలంలోని బొప్పాయిపురం గ్రామానికి చెందిన సానా రోహిత్‌కుమార్ అనే రెండేళ్ల బాలుడికి తలసేమియా పింఛన్ కింద మంజూరైన రూ.10 వేలను శనివారం అందజేశారు. రోహిత్‌కుమార్‌కు తలసేమియా ఉండడంతో తల్లిదండ్రులు గ్రామంలోని సచివాలయంలో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. పింఛన్ మంజూరవ్వడంతో సర్పంచ్ గుజ్జు మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.రవికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయం


భూమిపూజ నిర్వహిస్తున్న ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్

సోంపేట: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. పట్టణంలోని గొల్లవీధిలో నూతన సామాజిక భవనం నిర్మాణానికి శనివారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు నగిరి శరత్, ఉప సర్పంచ్ మల్లా వెంకటరమణ, పార్టీ నాయకులు జుత్తు గోపి, దొండపాటి శ్రీను, కేశవరావు, కృష్ణారావు, బైరాగి తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు స్థలం అప్పగింత


వక్ఫ్ బోర్డు స్థలం అప్పగిస్తున్నట్లు సంతకాలు చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: పట్టణంలో ఇటీవల నిర్వహించిన స్వేచ్ఛావతి అమ్మవారి ఉత్సవాల నిమిత్తం, ఆస్పత్రి రోడ్డులోని విశాలమైన వక్ఫ్ బోర్డు స్థలం పీర్ల పంజాను మూడు నెలల వినియోగం నిమిత్తం ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు అనుమతులు తీసుకున్నారు. ఆ స్థలం వినియోగానికి సంబంధించిన గడువు పూర్తవ్వడంతో తిరిగి వక్ఫ్ బోర్డుకి శనివారం అప్పగించారు. వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ సాదిఖ్ షేక్, వక్ఫ్ బోర్డు అధికారి రియాజ్ ఖాన్‌లకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులైన పిలక దేవరాజ్, వల్లంపాటి మూర్తిలు స్థానిక ముస్లిం పెద్దల సమక్షంలో స్థలాన్ని అప్పగిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక ముస్లిం పెద్దలు జోహార్‌ఖాన్, అలీమ్‌ఖాన్, అబ్దుల్లామన్నన్, జాకీర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.